క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ



భూమి పూజ చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: మండపల్లి గార పోలమ్మ కాలనీలో 14వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ పిట్ట శశిరేఖ శనివారం భూమి పూజ చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు సమకూరాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పిట్ట మామయ్యరెడ్డి, గ్రామ పెద్దలు పాతిర్ల వల్లభరావు, పాండవ బెహరా, ప్రకాశ్ ఆచారి, తిప్పన కురయ్యరెడ్డి ఉన్నారు.

చెరువులో గుర్రపుడెక్క తొలగింపు



గుర్రపుడెక్కను తొలగిస్తున్న గ్రామస్తులు

పలాస: బ్రాహ్మణతర్లా గ్రామంలోని పాత్రుని కోనేరులో పేరుకుపోయిన గుర్రపుడెక్కను గ్రామస్తులు శ్రమదానంతో శనివారం తొలగించారు. గ్రామంలోని ప్రజలు ఈ కోనేటిలో స్నానాలతో పాటు పశువులకు ఇతర అవసరాలకు నీటిని వినియోగిస్తున్నారు. కోనేటిలో గుర్రపుడెక్క ఉండటం వల్ల అనేక ఇబ్బందులు కలుగుతుండటంతో పలాస పీఏసీఎస్ అధ్యక్షుడు పైల చిట్టిబాబు చొరవతో తొలగించారు. ఉపసర్పంచి పొందర ఈశ్వరరావు, కోరాడ నాగరాజు పాల్గొన్నారు.

రోగికి ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం రూరల్: కొళారీ గ్రామానికి చెందిన ఇసురు లోకేశ్వరమ్మ అనారోగ్యంతో బాధపడుతోంది. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఆమెకు అదే గ్రామానికి చెందిన జీఎస్ ఫౌండేషన్ సభ్యులు అండా నిలిచారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెకు రూ.5,500 శనివారం అందజేసి మానవత్వం చాటుకున్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానం పొందిన ఉపాధ్యాయులు

మందస: సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తూ బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ భాస్కరరావు, ఉపాధ్యాయులు జె.వెంకటరావు, పి.సునీతలను శనివారం సన్మానించారు. పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ చిచ్చుల నళినీ ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బీఎస్ సాల్మన్, ఉపాధ్యాయులు అప్పారావు, నగిరి కరుణాకర్, ఎస్.నారాయణరావు, ఆర్.చంద్రశేఖర్, వై.తులసీదాసు, ఇందిరా, జయరాం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాసరావు, దద్ద కిరణ్‌కుమార్, విజయ్‌బాబు, వాసుదేవ పాల్గొన్నారు.

వైఎస్సార్‌బీమా సొమ్ము అందజేత

కోటబొమ్మాళి: కురుడు పంచాయతీ పాకివలస గ్రామానికి చెందిన ఇప్పిలి పోలమ్మ ఇటీవల మరణించారు. ఆమె వైఎస్సార్ బీమా పాలసీదారు. దీంతో ఆమె కుటుంబానికి ఒక లక్ష రూపాయలు బీమా మంజూరైంది. బీమా మొత్తాన్ని సర్పంచ్ కోతి చిన్నారావు చేతులమీదుగా పోలమ్మ కుటుంబసభ్యులకు శనివారం అందజేశారు. వార్డు సభ్యుడు దండాసి సింహాచలం, వెల్ఫేర్ అసిస్టెంటు శ్రావణి, వలంటీర్ ఖాలాఖాన్ పాల్గొన్నారు.

నియోజకవర్గస్థాయి పోటీలకు 380 మంది ఎంపిక

ఇచ్ఛాపురం రూరల్: మండలస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన 380 మంది విద్యార్థులు నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికయ్యారని మండపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాడు ప్రకాశరావు తెలిపారు. పాఠశాల ఆవరణలో రెండు రోజుల పాటు నిర్వహించిన అన్ని క్రీడా విభాగాల్లో ప్రతిభ చూపిన వారిని నియోజకవర్గ పోటీలకు పీఈటీలు ఎంపిక చేశారన్నారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



లక్ష్మణరావును సత్కరిస్తున్న మంత్రి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు: రాష్ట్రస్థాయి ఉత్తమ ఉధ్యాయుడుగా ఇటీవల అవార్డు అందుకున్న గోవిందపురం ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు గొల్లపల్లి లక్ష్మణరావును మంత్రి సీదిరి అప్పలరాజు శనివారం సన్మానించారు. మరిన్ని అవార్డులు పొందాలని ఆకాంక్షించారు.

చట్టం దృష్టిలో అందరూ సమానమే

స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి జరిగిన అవినీతిలో సీఐడీ అధికారులు టీడీపీ అధినేత చంద్రబాబును అరెస్టు చేయడం సబబేనని పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేనన్నారు. అవినీతి జరిగినట్టు పక్కా ఆధారాలతోనే ఆయన్ని సీఐడీ అధికారులు అరెస్టు చేశారన్నారు. నైపుణ్యాల అభివృద్ధి పేరుతో చంద్ర బాబు యువతను మోసగించారని మండిపడ్డారు. ఆయనపై ఉన్న అన్ని కేసులను పూర్తిస్థాయిలో విచారించి శిక్షపడేలా చూడాలని అభిప్రాయపడ్డారు.

పెద్ద మోసకారి..



చంద్రబాబు పెద్ద మోసకారి. రూ. వేల కోట్ల ప్రజాధనాన్ని దోపిడీ చేసిన ఆయన్ని కఠినంగా శిక్షించాలి. వెన్నుపోటు రాజకీయాలతో పబ్బం గడిపిన చంద్రబాబును అరెస్టు చేయడం సమంజసమే.

–ఎస్.రాఘవరావు, మాజీ ఎంపీపీ, టెక్కలి

అడ్డంగా దొరికారు



ఇన్నాళ్లు తప్పించుకు తిరిగిన చంద్రబాబు ఇప్పుడు అడ్డంగా దొరికిపోయారు. ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టించడానికి కట్టుకథలు అల్లుతూ ప్రచారాలు చేస్తారు. అధికారులు వారి పని వారు చేస్తున్నారు. చంద్రబాబు తప్పు చేశారు కాబట్టే సీఐడీ అధికారులు అరెస్టు చేశారు.

మల్లా సురేష్‌కుమార్, అధ్యక్షుడు,
పలాస క్యాష్యూ మాన్యుఫాక్చర్ అసోసియేషన్

నిరసనలు అప్రజాస్వామికం



చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో టీడీపీ నాయకులు రోడ్డెక్కి నిరసనలు తెలపడం అప్రజాస్వామికం. సుదీర్ఘ అనుభవం ఉన్న ఆయన తన నిజాయితీని న్యాయస్థానాల్లో నిరూపించుకోవాలి. అంతేతప్ప వ్యవస్థలను, ప్రభుత్వంపై బురదజల్లే చర్యలు సరికాదు. ఇది అప్రజాస్వామికం. చట్టం ముందు అందరూ సమానులే.

– పీఎం తిలక్, వైఎస్సార్‌సీపీ
జిల్లా ప్రధాన కార్యదర్శి, కవిటి మండలం

పాపం పండింది



చంద్రబాబు పాపం పండింది. అందుకే చేసిన తప్పులు బయట పడుతున్నాయి. స్కిల్‌డెవలప్‌మెంట్ పేరుతో కోట్లాది రూపాయల అవినీతి జరిగింది. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో టీడీపీ నాయకులు అలజడి సృష్టించేందుకు చూస్తున్నారు.

–పిలక రాజలక్ష్మి,
ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్

అవినీతి బట్టబయలు



గత టీడీపీ పాలనలో చంద్రబాబు ఆర్భాటంగా సృష్టించిన నకిలీ కంపెనీల బాగోతం ఆధారాలతో బహిర్గతమైంది. ప్రజాధనాన్ని లూటీ చేసిన ఆయనకు కౌంట్ డౌన్ స్టార్ట్ అయ్యింది. చంద్రబాబు అండ్ పార్టీ నాయకులు చేసిన అవినీతి బండారం పూర్తిగా ఆధారాలతో బయటపడింది. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో నిరుద్యోగులకు చేసిన మోసానికి ప్రతిఫలంగా చంద్రబాబును సీఐడీ అధికారులు పక్కా ఆధారాలతోనే అరెస్టు చేశారు. అమరావతి రాజధాని నిర్మాణం పేరుతో రూ. 1800 కోట్లు, స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో రూ. 371 కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్న చంద్రబాబును జనసేన అధ్యక్షుడు పవన్ ఎందుకు ప్రశ్నించడం లేదు. చంద్రబాబు చేసిన అవినీతిలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుకు కూడా వాటాలున్నాయి. కొద్ది రోజుల్లో ఆయన్ని అరెస్టు చేయడం ఖాయం.

–దువ్వాడ వాణి, వైఎస్సార్‌సీపీ
టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త

వ్యవస్థలపై నమ్మకం పెరిగింది



నైపుణ్యాల అభివృద్ధి పేరుతో చంద్ర బాబు అవినీతికి పాల్పడ్డారు. పక్కా ఆధారాలతోనే సీఐడీ ఆయన్ని అరెస్టు చేసింది. యువతకు నైపుణ్యాల అభివృద్ధి శిక్షణ పేరుతో పెద్ద అవినీతికి తెరలేపారు. చంద్రబాబు డొల్లతనం బయటపడింది. యువతకు చేసిన మోసానికి పాపం పండి అరెస్టు అయ్యారు. దీంతో న్యాయ, పోలీసు వ్యవస్థపై, కేంద్ర సంస్థలపై ప్రజలకు నమ్మకం కుదిరింది. గడిచిన 40 ఏళ్లలో అనేక అవినీతి వ్యవహారాలు చేసినా వ్యవస్థలను మ్యానేజ్ చేసి తప్పించుకున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ అవినీతి కేసులో ఏ–2గా ఉన్న అచ్చెన్నాయుడను కూడా అరెస్టు చేసి విచారిస్తే నిజాలు బయటకు వస్తాయి. యువతకు అన్యాయం చేసిన బాబుకు జైలు శిక్ష పడాలని ప్రజలంతా కోరుకుంటున్నారు.

–పేరాడ తిలక్,
కళింగ కార్పొరేషన్ చైర్మన్

ప్రజల సొమ్మును మేసేశారు..



చేసిన పాపాలు శాల పాల్లా చంద్రబాబును ఇంకా వెంటాడుతాయి. ప్రజల సొమ్మును అప్పనంగా మేసేశారు. ఆయనపై ఉన్న మరిన్ని అవినీతి కేసులపై విచారణ చేపట్టాలి.

– కొల్లి భాస్కరరావు, కొండవూరు సర్పంచ్,
వజ్రపుకొత్తూరు మండలం

యువతరాన్ని మోసగించడమే



స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో యువకులను చంద్రబాబు మోసం చేశారు. యువతీ, యువకులు నైపుణ్యాభివృద్ధి చెందడం ఆయనకు ఇష్టం లేదు. అందుకే ఆయనకు మద్దతుగా ఎవరూ ముందుకు రావడం లేదు. చంద్రబాబుకు శిక్షపడాలి.

బిరాటి వైకుంటరావు, రెండో వార్డు, కాశీబుగ్గ

అరెస్టు సరైనదే



చంద్రబాబు అరెస్ట్ సరైనదే. అధికారంలో ఉన్నప్పుడు అవినీతి, అక్రమాలకు పాల్పడడంతో నేడు అవి వెలుగులోకి వస్తున్నాయి. లేని కంపెనీలను సృష్టించి తప్పుడు లెక్కలతో రూ.కోట్లు స్వాహా చేశారు. చేసిన పాపానికి ప్రతిఫలం అనుభవించకతప్పదు. చట్టం ముందు అందరూ సమానులే. టీడీపీ అవినీతి ఊబిలోకి చిక్కుకుపోయింది. ఆ పార్టీ నాయకులు ఇన్నాళ్లు చట్టానికి దొరకకుండా తప్పించుకుంటున్నారు. ఇకపై వారి ఆటలు సాగవు. అవినీతికుంభకోణాల్లో పాత్రదారులకు శిక్ష తప్పదు.

– దల్లి జానకీరావురెడ్డి,
వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి, మందస

తప్పుచేశారు కాబట్టే అరెస్టు చేశారు



చంద్రబాబు తప్పు చేశారు కాబట్టే చట్టం నుంచి తప్పించుకోలేకపోయారు. పూర్తి ఆధారాలు దొరికాయి కాబట్టే ఆయన్ని సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారు. తప్పు అనేది ఎవ్వరు చేసినా శిక్ష పడాల్సిందే. చట్టం దృష్టిలో అందరూ సమానమే. చంద్రబాబు పాలనలో అన్నిరంగాల్లో అవినీతి జరిగింది. అమాయకులను బలిచేసిన చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ అవినీతిలో తప్పించుకోలేక పోయారు. ఆయన్ని అరెస్ట్ చేయడంతో వ్యవస్థమీద నమ్మకం పెరుగుతుంది.

పైల వెంకటరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు, పలాస

బాబు అవినీతి పరుడు



చంద్రబాబు అవినీతి జలగ. గతంలో వ్యవస్థలను మేనేజ్ చేసి చాలా కేసుల్లో స్టేలు తెచ్చుకున్న ఘనుడు. ఇప్పుడేమో అడ్డంగా దొరికిపోయారు. శిక్ష పడేలా చూడాలి

– ఎ. గోవిందరావు, సర్పంచ్,
పొల్లాడ, వజ్రపుకొత్తూరు మండలం

మేలు జరిగితేనే ఆశీర్వదించండి

- మంత్రి సీదిరి అప్పలరాజు
- పూండి–గోవిందపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



గోవిందపురంలో ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు: అర్హులందరికీ నవరత్న పథకాలను వర్తింపజేశాం.. ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుని అమలు చేశాం.. ప్రతిఇంటికీ సంక్షేమ పథకాలు చేరువ చేశాం.. మీకు మేలు జరిగితేనే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి అని రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పూండి–గోవిందపురంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. గోవిందపురంలో రూ.1.60 కోట్లుతో నాడు–నేడు పథకం ద్వారా ఉన్నత పాఠశాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అలాగే జూనియర్ కళాశాల తరగతి గదుల నిర్మాణాలకు మరో రూ.66 లక్షలు మంజూరు చేసినట్టు వెల్లడించారు. సీసీ రోడ్ల ఏర్పాటు, శ్మశాన వాటికకు రహదారి తదితర అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. నవరత్నాలు అమల్లో భాగంగా అమ్మ ఒడి, ఆసరా, పేదలందరికీ ఇళ్లు, ఫీజు రీయింబర్‌మెంట్ ఇలా ప్రతీ ఇంటా సంక్షేమ ఫలాలు అందించామని చెప్పారు. రానున్న సంక్రాంతి పండుగ నుంచే ఇచ్చిన మాటకు కట్టుబడి అవ్వాతాతలకు రూ.3 వేలు పింఛన్ అందజేస్తామన్నారు. గత ఎన్నికలకు ముందు అక్కచెల్లెమ్మలకు రుణమాఫీ చేస్తామని చెప్పి చెల్లని చెక్కులను చంద్రబాబు చేతిలో పెట్టారని, పసుపు కుంకుమ అంటూ మోసగించారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు రుణమాఫీ, చేయూత పథకాలు ఇస్తుంటే రాష్ట్రం అప్పుల ఊబిలోకి వెళ్లిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేసిన చరిత్ర చంద్రబాబుదన్నారు. మహిళలకు మేలు జరుగుతుంటే ఓర్వలేని టీడీపీ నాయకులు ఎన్నికలు సమీపిస్తుండడంతో అమ్మకు వందనం, మహిళాశక్తి అంటూ పేర్లుమార్చి.. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను కాపీ కొట్టి ప్రజలను మోసగించేందుకు వస్తున్నారని మండిపడ్డారు. అలా వచ్చే టీడీపీ నాయకులను నిలదీయాలన్నారు. అనంతరం గోవిందపురంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను తెలియజేశారు. చేకూరిన లబ్ధిని వివరించారు. ఇంకేమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిరంతరం ప్రజాసంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పాలిన శ్రావణి, సర్పంచ్ పాలిన రమ్య, ఎంపీటీసీ సభ్యుడు కర్ని లోకనాథం, మండల పార్టీ అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్యనాయుడు, మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు పాలిన ఉమామహేశ్వరరావు, గంగెట్ల గున్నమ్మ, పలాస–కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ఎ.శేషగిరిరావు, క్లస్టర్ ఇన్‌చార్జి దున్న బాలరాజు, కె.గోపి, ఐ.హేమంత్‌రాజు, జి.విశ్వనాథం పాల్గొన్నారు.

కానరాని స్పందన



ఇచ్ఛాపురం బస్టాండ్ కూడలిలో నిరసన తెలియజేస్తున్న టీడీపీ నాయకులు

కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం, సోంపేట, టెక్కలి, కోటబొమ్మాళి: స్కిల్ డెవలప్‌మెంట్ పథకంలో జరిగిన అవినీతి కేసులో టీడీపీ అధినేత చంద్రబాబును సీఐడీ అధికారులు అరెస్టు చేసిన నేపథ్యంలో ఆ పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమాలకు ప్రజల నుంచి ఏమాత్రం స్పందన కనిపించలేదు. టీడీపీ నాయకులు నిసనన కార్యక్రమాలకు శనివారం ఇచ్చిన పిలుపును ఎవరూ పట్టించుకోలేదు. దీంతో అన్ని కార్యకలాపాలు యాథావిధిగా కొనసాగాయి. ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను ముందస్తుగా పోలీసులు అరెస్టు చేసి ఎచ్చెర్ల పోలీసు స్టేషన్‌కు తరలించారు. కవిటి, ఇచ్ఛాపురం మండలాలకు చెందిన నాయకులు బస్టాండ్ కూడలిలో కొద్దిసేపు నిరసన తెలియజేశారు. కాగా సోంపేటలో సుమారు 30 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే కోటబొమ్మాళిలో 15 మందిని అరెస్టు చేసి తరువాత విడిచిపెట్టారు.

లోక్ అదాలత్‌లో 506 కేసులు పరిష్కారం



టెక్కలిలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు



సోంపేట: లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం



కాశీబుగ్గ: పలాస కోర్టులో లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి చక్రవర్తి మల్లా, న్యాయవాదులు

టెక్కలి:

టెక్కలి కోర్టు సముదాయంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 506 కేసులు పరిష్కరించినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. ఇన్‌చార్జి సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జి ఎస్.హెచ్.ఆర్. తేజచక్రవర్తి మల్ల ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించారు. ఇందులో భాగంగా సివిల్ కేసులు 4, హిందూ వివాహ చట్టం కేసులు 2, క్రిమినల్ కేసులు 500 పరిష్కరించి మొత్తం 7,97,660 రూపాయల మేరకు సెటిల్‌మెంట్ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వివేకానంద, న్యాయవాదులు పి.ఆనందరావు, బి.శ్రీనివాసరావు, పి.బాబురావు, పి.చంద్రుడు, ఎం.గోవింద్, కె.ఈశ్వర్రావు, పి.బాలకృష్ణ పాల్గొన్నారు.

కోటబొమ్మాళిలో 688..

కోటబొమ్మాళి: స్థానిక కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 688 కేసులు పరిష్కారమైనట్టు న్యాయవాద సంఘఅధ్యక్షుడు డి.నరసింహమూర్తి తెలిపారు. కోటబొమ్మాళి కోర్టు ఇన్‌చార్జి జడ్జి (శ్రీకాకుళం ఎక్సైజ్ కోర్టు జడ్జి) డి భరణి శ్రీకాకుళం కోర్టు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా లోక్ అదాలత్‌ను నిర్వహించారు. క్రిమినల్ కేసులు 196, పెట్టీకేసులు 489, మనోవర్తి–1, బ్యాంకురుణాలు–2 కేసులు రాజీ అయ్యాయు. ఏపీపీ హరిప్రియ, న్యాయవాదులు పి.అర్జునరావు, బి.ధర్మారావు పాల్గొన్నారు.

సోంపేటలో.. 514 కేసులు..

సోంపేట: సోంపేట కోర్టుల సముదాయంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 514 కేసులు పరిష్కారమయ్యాయి. సీనియర్ సివిల్ న్యాయమూర్తి జె.శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ న్యాయమూర్తి ఎ.రాము రెండు బెంచుల్లో అదాలత్ నిర్వహించగా.. 514 కేసులు పరిష్కారమయ్యాయి. రాజీతో ఇరువర్గాలకు లాభం చేకూరుతుందని సీనియర్ సివిల్ న్యాయమూర్తి జె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. న్యాయవాదులు ఎం.క్రిష్టారావు, కల్యాణిదేవి పాల్గొన్నారు.

పలాసలో 819 కేసులు..

కాశీబుగ్గ: పలాస జూనియర్ సివిల్ కోర్టులో నిర్వహించిన అదాలత్‌లో 819 కేసులు పరిష్కారమైనట్టు ఇన్‌చార్జి జూనియర్ సివిల్ జడ్జి చక్రవర్తి మల్ల తెలియజేశారు. ఇందులో సివిల్ కేసులు–5, మని సూట్–1, మెంటేనెన్సు కేసు–1, అడ్మిషన్ కేసులు 787, కాంపౌండబుల్ కేసులు 23 పరిష్కారమైనట్టు పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.విశ్వేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ జి.ఎం.ఎస్.అనీల్‌రాజు, ట్రెజరర్ వి.రవికుమార్, వైస్ ప్రెసిడెంట్ ఫయాద్ అహ్మద్, న్యాయవాదులు పి.ఎల్. నారాయణ, చంద్రశేఖర్, ఎస్.వి.రమణ, కోత రజినికుమార్, ప్రభాకర్ పాల్గొన్నారు.

నూతన పింఛన్ల అందజేత



ఇచ్ఛాపురం రూరల్: పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రాజశేఖరరెడ్డి



మందస: గిరిజన లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న నాయకులు



కవిటి: పింఛన్లు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

ఇచ్ఛాపురం రూరల్: తేలుకుంచి పంచాయతీకి చెందిన పలువురు లబ్ధిదారులకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. వీటిని సర్పంచ్ పాతిర్ల రాజశేఖరరెడ్డి శనివారం పంపిణీ చేశారు.

కొండలోగాంలో..

మందస: మండలంలోని గిరిజన పంచాయతీ కొండలోగాంలో కొత్తగా మంజూరైన పింఛన్లను జెడ్పీటీసీ సభ్యురాలు సవర చంద్రమ్మ, సర్పంచ్ సవర రోజా, ఎంపీటీసీ సభ్యురాలు సవర ఢిల్లేశ్వరి శనివారం పంపిణీ చేశారు. అర్హులైన వారికి కొత్తగా ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేసిందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సవర ఢిల్లేశ్వరరావు, సవర డొంబురు, సవర చంద్రరావు, ఈశ్వరరావు, సచివాలయం సిబ్బంది డి.రవికుమార్, సంజీవరావు పాల్గొన్నారు.

బల్లిపుట్టుగలో..

కవిటి: బల్లిపుట్టుగ పంచాయతీలో 11 మందికి మంజూరైన కొత్త పెన్షన్లను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ శనివారం పంపిణీ చేశారు. ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ నివాసంలో జరిగినక ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మార్పు వెంకటేశ్ ఉన్నారు.

మహామనిషి కణితి

- వసతిగృహం ప్రారంభంలో మంత్రి అప్పలరాజు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, ముఖ్యఅతిధులు

కాశీబుగ్గ: పలాసలో ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఏర్పాటుకు అన్ని విధాలుగా ప్రయత్నించి సుమారు రూ.10 కోట్లు ఆస్తులు దానం చేసిన మహామనిషి దివంగత మాజీ ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాథం అని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాసలో డాక్టర్ కణితి ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు చెందిన వసతి గృహాన్ని శనివారం కణితి కుటుంబ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విశ్వనాథం కుమార్తె డాక్టర్ కణితి శారధా, కుమారుడు రాజేంద్ర, లయన్స్ క్లబ్ బోర్డ్ అపాయింటెడ్ ట్రస్టీ ఎం.విజయ్‌కుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక

టెక్కలి: సంతబొమ్మాళి మండలం కొల్లిపాడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఉమ్మిడి రాజుతో పాటు ఆయన అనుచరులు శనివారం ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. మలగాం సర్పంచ్ ఎస్.వెంకటేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.సతీష్, కార్యకర్తలు సవరయ్య, చిన్నయ్య, రమణ, ఎల్లయ్య ఉన్నారు.

ఆధ్యాత్మికతతోనే ఆనందం



పూజల్లో పాల్గొన్న చైర్‌పర్సన్ విజయ తదితరులు

సోంపేట: ఆధ్యాత్మికతతోనే ఆనందం ఉందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. సోంపేట పట్టణంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న సత్యన్నారాయణస్వామి రాజగోపురంలో 16 అడుగుల ఎత్తుగల ద్వారబంధాల ప్రతిష్ఠాపన కార్యక్రమం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉపసర్పంచ్ మల్లా వెంకటరమణ, ఉత్తరాల వెంకన్న, లక్ష్మీనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టెక్కలి: టెక్కలిలో పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ ఎస్.శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రావివలస విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వాహణ పనులు నిమిత్తం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. సబ్ కలెక్టర్ కార్యాలయం పరిధి, శ్రీనివాసానగర్, ఎన్టీఆర్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, రోటరీనగర్, ఆర్టీసీ డిపో ప్రాంతాల్లో సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



ఒకే వేదికపై పూర్వవిద్యార్థులు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన 1983–85 సంవత్సరానికి చెందిన సైన్స్ విభాగం పూర్వపు విద్యార్థులంతా శనివారం టెక్కలిలో ఆత్మీయ కలయిక ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా చదువుకున్న రోజులను నెమరవేసుకుంటూ సందడి చేశారు. గ్రూపుఫొటోలు తీసుకుని మురిసిపోయారు.